క్లుప్తంగా

24న మెగా ఉద్యోగ మేళా

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాళాశాలలో 24న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్ సంయుక్తంగా సత్యవేడులో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో 15 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఇస్తారని వివరించారు. యువతీయువకులు ఆధార్ కార్డు జిరాక్స్, బయోడేటా, సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఆసక్తి గలవారు 22 తేదీ లోపు హెచ్ టిటిపి:// ఆర్.బి.జివై// ఏఎక్స్6 హెచ్ఎక్స్ అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 9092697478, 8121585857 సంప్రదించాలని సూచించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


చెక్కు అందిస్తున్న విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని నీర్పాకోట గ్రామానికి చెందిన జొన్నగడ్డల రేవతికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.50 వేల చెక్కును శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న సుభాష్

పిచ్చాటూరు: గ్రామానికి చెందిన సుభాష్ శనివారం తన తండ్రి అర్ముగం రెడ్డి జ్ఞాపకార్థం ఆర్‌టీసీ బస్టాండ్‌లో పేదలకు అన్నదానం చేశారు. అయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఐక్యపై ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పరీక్షకు మట్టి సేకరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శివం టూ శివం మార్గంలో శనివారం ఆలయ ఇంజనీరింగ్ అధికారులు మట్టిని సేకరించారు. సాయిల్ టెస్టు కోసం సేకరించినట్లు వారు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


హారిక

శ్రీకాళహస్తి: అఖిల భారత విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.హారిక ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అంతర్ కళాశాలల పోటీల్లో హారిక ఉత్తమ ప్రతిభ చూపినట్లు వెల్లడించారు.

నేడు చేమూరులో 'గడప గడపకు'

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : తొట్టంబేడు మండలం చియ్యవరం సచివాలయం పరిధిలోని చేమూరు, దళితవాడ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

స్థల ఆక్రమణకు చెక్

ఏర్పేడు : మండలంలోని కోబాక ఎస్టీ కాలనీలో ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి ఇల్లు నిర్మించుకునేందుకు యత్నించగా పంచాయతీ కార్యదర్శి లోకముని అడ్డుకున్నారు. సర్కారు స్థలాలను ఆక్రమిస్తే సహించే ప్రసక్తే లేదని కార్యదర్శి స్పష్టం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై కేసు

ఏర్పేడు : మండలంలోని బండారుపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి శనివారం తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేటలో కృష్ణమూర్తి అనే వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి శనివారం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేటలో శుక్రవారం ఆత్మహత్యకు యత్నించిన అబ్దుల్ కరీ(26) అనే యువకుడు తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

ఇంటింటా సంక్షేమ సంబరం

- ప్రతి కుటుంబానికి లబ్ధి
- అర్హులందరికీ పథకాలు
- ఎప్పటికప్పుడు ప్రజాసమస్యల పరిష్కారం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ సంబరాలు జరుపుకుంటున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మడిపాక, రాజులకండ్రిగ, మడిపాక దళితవాడలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ గురుమూర్తితో కలిసి పాల్గొన్నారు. సుమారు 325 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సీడీపీఓ శాంతిదుర్గ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాల వల్లే నిర్భయంగా జీవనం సాగిస్తున్నామని ప్రజలు చెబుతుంటే ఆనందంగా ఉందని వెల్లడించారు. కుట్ర రాజకీయాలకు తెరతీస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నకే అండగా నిలవాలని కోరారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ చెంగల్రాజు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రవియాదవ్, మధుసూదనరాజు, ఎస్ఎస్ చంద్ర, రామయ్య ఆచారి, చలం రాజు, మునిశేఖర్ రాజు, మురళి రాజు, మణి రాజు, లోకనాథరెడ్డి, దామోదరంరెడ్డి, జీపీ యాదవ్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యం


జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం : యువతకు ఉద్యోగాలను కల్పించే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ శ్యామ్ మోహన్, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఉద్యోగ కల్పనలో భాగంగా 24వ తేదీన సత్యవేడులో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 190కి పైగా ఉన్న చిన్న, మధ్య, పెద్ద తరహా కర్మాగారాల్లో యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హులైన నిరుద్యోగ యువతను జాబ్‌మేళాకు హాజరయ్యేలా చొరవతీసుకోవాలని సూచించారు. శ్యామ్ మోహన్ మాట్లాడుతూ సీడాప్, డీఆర్‌డీఏ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్ సంయుక్తంగా ప్రతి నెలా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, అన్నాదొరై, గురుస్వామి, మనోహన్, మోహన్, సారకాయలు, సర్పంచ్‌లు రామ్మూర్తి, మురుగేశం, ఎంపీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తై అమావాస్య పుజలు


ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం : మండలంలోని పలు ఆలయాల్లో శనివారం తమిళ తై అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి తర్వాత తమిళ తై నెలలో వచ్చే మొదటి అమావాస్యకు ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో సొరకాయల స్వామి ఆలయంలో ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసి పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సొరకాయల స్వామిని దర్శించుకున్నారు. సొరకాయలను ఆలయంలో కట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అలాగే కైలాసనాథ కోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమంలో అమావాస్య పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక వీరరాఘవస్వామి ఆలయంలో మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఫిబ్రవరి 11న లోక్‌అదాలత్


సమావేశంలో న్యాయమూర్తి, పోలీసులు, న్యాయవాదులు

శ్రీకాళహస్తి: జాతీయ లోక్ అదాలత్‌ను ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు భవనంలో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌పై క్షేత్రస్థాయిలో ఫిర్యాదీలు, కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

భక్త వరదుడిపై వీరరాఘవస్వామి చిద్విలాసం

నారాయణవనం : వార్షిక ఉత్సవాల్లో భాగంగా కనకవల్లి, వేదవల్లి సమేత వీరరాఘవస్వామి శనివారం రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించి గ్రామంలో విహరించారు. మధ్యాహ్నం ఆలయంలో దీపారాధనోత్సవంలో పట్టుశాలి కులస్తులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు. తై అమావాస్య కావడంతో పలువురు ఉదయం ఆలయ ప్రాంగణంలో పెద్దలకు సామూహిక తర్పణాలు వదిలారు. రాత్రి వీరరాఘవస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం హనుమంత వాహన సేవ నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించే చక్రస్నానంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆధార్ కేంద్రాల పరిశీలన


పెద్ద ఈటిపాకం ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలగణేషన్

సత్యవేడు: మండలంలోని పెద్ద ఈటిపాకం, ఇరుగుళం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ బాలగణేషన్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఆధార్ నమోదు చేసుకున్న వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అంతకు ముందు సచివాలయంలో సిబ్బంది హాజరును పరిశీలించారు. పంచాయతీలో 160 మంది ఆధార్ నమోదు చేసుకున్నట్లు సెక్రటరీ జలజశ్రీ తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ, సెక్రటరీ హరీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ ముత్తు, మహిళా పోలీస్ మోహన్‌కుమారి, లత పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

వరదయ్యపాళెం: మండలంలోని కళత్తూరులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తై అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. సాయంత్రం 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. స్థానికులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ కామిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, పర్వతరెడ్డి సుధాకర్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోహనాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామోత్సవంలో ఆలయ ఈఓ లత, మాజీ చైర్మన్ చక్కిరాల సుప్రజ దంపతులు, మాజీ పాలక మండలి సభ్యులు రమేష్ రెడ్డి, మాధవరెడ్డి, అశోక్, గుత్తి త్యాగరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లపై నిషేధం


మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీనాయక్

శ్రీకాళహస్తి: పురపాలక పరిధిలో ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్నట్లు కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వర్తక, వాణిజ్య సముదాయాల యజమానులు,ఫ్లెక్సీ బ్యానర్ల ప్రింటింగ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లతో పాటు ప్లాస్టిక్ బ్యానర్లను కూడా నిషేధించినట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీనిపై ముమ్మరంగా ప్రచారం కూడా చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని వివరించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు సాయిసింధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరికీ దిశ యాప్‌పై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి తెలిపారు. శనివారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో చిన్నపిల్లలు, మహిళల అక్రమ రవాణా నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 100, 112 నంబర్లకు కాల్ చేయాలన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఉచితంగా న్యాయ సహకారం అందిస్తామని వెల్లడించారు. న్యాయ సలహాలకు 15100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సునీత, మల్లికార్జునయ్య, రాజేశ్వరరావు, రమేష్‌బాబు, ఎంఈఓ భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు చంద్రబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు వైఎస్సార్ పోషకాహార కిట్‌ల పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సుశీల్ కుమార్‌రెడ్డి

సత్యవేడు : మండలంలోని ఇరుగుళం అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులు, బాలింతలకు శనివారం వైఎస్సార్ పోషకాహార కిట్లను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. అలాగే పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు, పాలు అందజేశారు. వైఎస్సార్ పోషకాహార కిట్లలో ఉండే జొన్నపిండి, రాగిపిండి, బర్ఫీ, అటుకులు, ఎండు ఖర్జూరం, బెల్లం తదితరాలను తిని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, బూత్ కన్వీనర్ సురేంద్రరెడ్డి, శశికిరణ్ రెడ్డి, అజిత్, నరేష్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త మేనక, మహిళా పోలీసు శంకరమ్మ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

జోరుగా మహాశివరాత్రి ఏర్పాట్లు


ఆలయం వద్ద నేల చదును చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలకు ముక్కంటి ఆలయంలో జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసర ప్రాంతాలను శనివారం చదును చేశారు. ఆ స్థలాల్లో భక్తులు సేదదీరేందుకు షెడ్లు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

దళితవాడలో డ్రై డే

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని పొయ్య గ్రామం వద్ద రామానాయుడు ఎస్టీ కాలనీలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత జీకే జట్టు


ట్రోఫీ అందుకున్న జీకే జట్టుతో నిర్వాహకులు


బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక క్రీడా మైదానంలో జెర్సీ క్రీమ్ లైన్ డెయిరీ సహకారంతో 15 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో జీకే జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌లో 24 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చంద్రా లెవెల్స్, జీకే జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. జీకే జట్టు విజేత నిలవగా, చంద్రా లెవెల్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. జెర్సీ క్రీమ్ లైన్ డెయిరీ ప్రొడక్స్ జోనల్ మేనేజర్ బహుమతులు అందజేశారు. యువత క్రీడలపై ఆసక్తి చూపాలని, సంక్రాంతి క్రికెట్‌కు తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంసీ మేనేజర్ దయాకర్‌రెడ్డి, సాదిక్, రాజేష్, దయాకర్, చంద్రమోహన్, సునీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటి తరఫున ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తరఫున వైఎస్సార్‌సీపీ నేత జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. శనివారం మండలంలోని అరవకొత్తూరు, కమ్మకొత్తూరు, అక్కుర్తి, ఊబులాయపల్లి, ఉడమలపాడు, మంగళపురి, ముద్దుమూడి, దొడ్లమిట్ట, ముచ్చివోలు, ఎర్రగుడిపాడు గ్రామాల్లోని పట్టభద్రులను కలసి వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, శంకరయ్య, పుల్లయ్య, రమేష్, తాటిపర్తి శంకర్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య, ప్రభాకర్, పాల సొసైటీ డైరెక్టర్ అక్కుర్తి హరనాథరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్బరామిరెడ్డి, సర్పంచ్ మనోహర్, రవిశేఖర్‌బాబు, గురవయ్య, శాప్ డైరెక్టర్ పుల్లూరు వీరరాఘవరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గురునాథరెడ్డి, భారతి సిమెంట్ డీలర్ ముచ్చివోలు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న చంద్రప్ప తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజ తీర్థంలో శనివారం శ్రీ సత్యవ్రత భాస్కరక్షేత్ర అన్నదాన ట్రస్టు వారు భక్తులకు అన్నదానం చేశారు. తై అమావాస్యను పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారికి భరద్వాజతీర్థంలోని శివాలయంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో విచ్చేసిన భక్తులకు వారు అన్నదానం చేపట్టారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్ప, ట్రస్టు సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, సుధాకర్, చంద్ర, వాసుయాదవ్, మోహన్‌రావు, రాజేశ్వరరావు, రామానుజులు, త్యాగరాజు, మునికృష్ణయ్య, హేమంత్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దృఢత్వం

శ్రీకాళహస్తి: మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దృఢత్వం సాధించవచ్చని విశ్రాంత ఐపీఎస్ అధికారులు చక్రపాణి, రాజశేఖర్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్ ఇండియా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ సంస్థ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాది దామోదరం పాల్గొన్నారు.

గీత కార్మికులకు 'భరోసా'పై హర్షం

శ్రీకాళహస్తి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్లుగీత భరోసా పథకం ద్వారా గీత కార్మికులకు రూ.10 లక్షలు పరిహారం ప్రకటించటంపై గౌడ సంఘం నేత గోపీగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ కల్లు గీస్తూ చెట్టుపై నుంచి పడి మరణించినా, శాశ్వత అంగవైకల్యం బారిన పడినా ఈ పథకం వర్తిస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కల్లు గీత కార్మికుల పట్టించుకోలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు పూర్తి స్థాయిలో వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వనున్నారని వెల్లడించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బీసీలకు అండగా నిలిచి సాయం అందిస్తున్నారని తెలిపారు. బీసీలు ఎక్కడ మృతి చెందినా పార్టీతో ప్రమేయం లేకుండా రూ.10 వేలు సాయం చేస్తున్నారని కొనియాడారు.

భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభివృద్ధికి పెద్దపీట వేశామని, భక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యమిస్తున్నామని ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. శనివారం నిర్వహించిన ఆలయ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో ముక్కంటి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా 30 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. శ్రీకాళహస్తి కొండమిట్టలోని సిద్ధులయ్యస్వామి, గిరి ప్రదక్షిణ మార్గంలో వనసకోన, వెయ్యిలింగాల గోపురం, కోమటివాని గుంటలో కల్యాణమండపం నిర్మాణం, మయూర తీర్థం, శుకబ్రహ్మాశ్రమం వద్ద కోనేరు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. మోత కూలీలకు డ్రెస్ కోడ్ ఏర్పాటు, బ్రాహ్మణులకు వేతనం, 20 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా సేవలందించిన వారి ఇళ్లలో ఒకరికి ఉద్యోగం, తదితర అంశాలను పేర్కొన్నారు.

భూలోక కైలాసవాసా..


భరద్వాజతీర్థం వద్దకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం తై అమావాస్య పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గంగాదేవి, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి భరద్వాజ తీర్థంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలోని శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలురకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను చప్పరాలపై కొలువుదీర్చి మేళతాళాల నడుమ అధికారగణం వెంటరాగా ఊరేగింపుగా భరద్వాజతీర్థం తీసుకెళ్లారు. అక్కడ శివాలయ ఆవరణలోని మండపంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పసుపు, చందనం, కుంకుమ, విభూది, పాలు, నారికేళం, పెరుగు తదితర సుగంధ ద్రవ్యాలతో వేదోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించి తన్మయత్వం చెందారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


హాజరైన ప్రముఖులు, భక్తులు


అభిషేకం చేస్తున్న అర్చకులు